ఒకేషనల్ కళాశాలను సందర్శించిన జెడ్ఈ



సుభాష్‌నగర్: బహదూర్‌పల్లి చౌరస్తాలోని కేఎం పాండు మెమోరియల్ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలను మేడ్చల్ జిల్లా జెడ్ఈ వెంక్యానాయక్ గురువారం సందర్శించారు. తరగతులకు వెళ్లి సిలబస్ విషయం, పరీక్షలకు ఎలా ప్రిపేర్ అవుతున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మార్చిలో జరిగే వార్షిక పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా ప్రిన్సిపాల్ షేక్ మైమూన్, అధ్యాపకులను 90 రోజుల యాక్షన్ ప్లాన్ విషయమై ఆరా తీశారు. మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలని వారికి సూచించారు.

మర్యాదపూర్వక కలయిక



కొలన్ హన్మంత్‌రెడ్డితో షేక్ రఫియా బేగం

నిజాంపేట్: రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యదర్శిగా నియామకమైన షేక్ రఫియా బేగం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డిని గురువారం కలిశారు. ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డి ఆమెను శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్ఎంసీ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, బిక్కన్ షా, పద్మరావు తదితరులు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న జయంతికి తరలిరావాలి



జిల్లా గౌరవ అధ్యక్షుడు బాలయ్య

కుత్బుల్లాపూర్ : రాష్ట్ర ప్రభుత్వ రవీంద్రభారతీలో ఈనెల 11 వడ్డే ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించనున్నట్లు వడ్డెర సంఘం మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా గౌరవ అధ్యక్షుడు శివరాత్రి బాలయ్య తెలిపారు. కొంపల్లిలో గురువారం జరిగిన సన్నాహాక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 33 జిల్లాల నుంచి అధ్యక్ష, కార్యదర్శులతో పాటు మండల అధ్యక్షులు, మేధావులు, విద్యావంతులు, మహిళలు, వడ్డెర కుల బంధువులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

సహకార బ్యాంక్ ఏర్పాటు చేయాలని వినతి

దుండిగల్: దుండిగల్‌లో పీఏసీఎస్ సహకార బ్యాంకు ఏర్పాటు చేయాలని కోరుతూ దుండిగల్ గ్రామ ముఖ్య నాయకులు, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, డీసీఓకు గురువారం వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. దీనికి వారు సానుకూలంగా స్పందించి బ్యాంకు ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దుండిగల్ గ్రామ ముఖ్య నాయకులు చినంగి వెంకటేశం ముదిరాజ్, అమరం గోపాల్ రెడ్డి, జక్కుల కృష్ణ యాదవ్, జక్కుల శ్రీనివాస్, డి. ఆనంద్, రవీందర్ యాదవ్, నల్బారి కృష్ణ, మోరా అశోక్ ముదిరాజ్, బండారి మహేశ్, ఆకుల ప్రేమ్ పటేల్, ఈ. శ్రీనివాస్ గౌడ్, పాండు గౌడ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు కార్మికులకు గాయాలు

సుభాష్‌నగర్: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఇద్దరు తాత్కాలిక కార్మికులు గాయపడ్డారు. గాజులరామారం చౌరస్తాలో రోడ్డు విస్తరణలో భాగంగా గురువారం విద్యుత్ పనులు చేపడుతున్నారు. సాయంత్రం 4 గంటల సమయంలో అకస్మాత్తుగా కరెంట్ సరఫరా కావడంతో స్తంభంపై వైర్లు లాగే ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. అనిల్ అనే కార్మికుడు స్తంభం నుంచి కింద పడగా, మహేశ్ గాయపడ్డాడు. వెంటనే వీరిని చికిత్స కోసం షాపూర్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఏఈ చైతన్య భార్గవ్‌ను 'సాక్షి' వివరణ కోరేందుకు యత్నించగా అందుబాటులోకి రాలేదు.

నేడు భవిష్యనిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కార్యాలయ ఆధ్వర్యంలో ఈ నెల 10న (నేడు) భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్టీసీ బస్ టెర్మినల్‌లోని రెండో అంతస్తులోని పీఎఫ్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారని, ఖాతాదారుల సమస్యలు పరిష్కరించడమే కాకుండా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని ఆయన తెలిపారు.

అస్తవ్యస్తం.. అధ్వానం..



- చెత్తమయంగా జీడిమెట్ల పారిశ్రామికవాడ
- అంతంతమాత్రంగానే పారిశుద్ధ్య పనులు
- ఇబ్బందుల్లో స్థానికులు
- పట్టని సంబంధిత శాఖ అధికారులు

జీడిమెట్ల: ఆసియా ఖండంలోనే అతిపెద్దదిగా పేరొందిన జీడిమెట్ల పారిశ్రామికవాడ అధ్వానంగా తయారయ్యింది. పారిశుద్ధ్య పనులు అంతంత మాత్రంగానే చేపడుతున్నారు. దీనికితోడూ పరిశ్రమల నుంచి తీసుకువచ్చిన చెత్తను రోడ్లపైనే డంపింగ్ చేస్తుండడంతో చెత్తమయంగా మారుతున్నది. జీడిమెట్లలోనే ఒక వింగ్‌గా ఉన్న ఎస్వీ కోఆపరేటివ్ సొసైటీలో రోడ్ల పక్కన చెత్తాచెదారం ఎక్కువగా కనిపిస్తున్నది. ఇక్కడ సుమారు 300 వరకు పరిశ్రమలు ఉండగా దీనికివిడిగా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు. ఎస్వీ కోఆపరేటివ్ సొసైటీతో పాటు సమీపంగా ఉన్న గంపలబస్తీ నుంచి కొంతమంది చెత్తను తీసుకువచ్చి ఎస్వీకో ఆపరేటివ్ సొసైటీలోని రోడ్ల పక్కన వేసి వెళ్తున్నారు.



రోడ్డుకు పక్కనే ఏపుగా పెరిగిన ముళ్ల చెట్లు

చెత్త డంపింగ్‌ను అడ్డుకోవడంలో విఫలం..

రోడ్లపక్కనే చెత్తను వేయడం వలన ఇండస్ట్రీయల్ ఏరియా పురోగతి అదోగతిలా కనిపిస్తోంది. చెత్తను వేయకుండా అడ్డుకునేందుకు ఎస్వీ కోఆపరేటివ్ సొసైటీ అధికారులు స్థానికంగా సీసీ కెమరాలు ఏర్పాటు చేసి చెత్త వేసేవారిని గుర్తించాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని రోడ్లపక్కన చెత్తను డంప్ చేసే వారిని గుర్తించి చర్యలు తగు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

త్వరలోనే స్పెషల్ డ్రైవ్ చేపడుతాం..

నెలరోజులుగా ఒక్కో రోడ్డులో ఉన్న చెత్తను వెహికిల్ ద్వారా తరలిస్తున్నాం. దీంతో పాటు ప్రతిరోజూ రోడ్లపై ఉన్న చెత్తను సిబ్బందితో శుభ్రం చేయిస్తున్నాం. త్వరలోనే స్పెషల్‌డ్రైవ్‌లు నిర్వహించి చెత్తను రోడ్లపై వేసేవారిని గుర్తించి తగు చర్యలు తీసుకుంటాం.

– రజనీకాంత్ రెడ్డి (ఎస్వీ కోఆపరేటివ్ సొసైటీ మేనేజర్)



రోడ్డు పక్కనే కాల్చేసిన చెత్త వ్యర్థాలు



సబ్‌స్టేషన్ సమీపంలో చెత్తకుప్ప

ఎన్‌సీఎల్ వద్ద యూటర్న్‌కు బారికేడ్ల ఏర్పాటు

కుత్బుల్లాపూర్: జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ పనులు జరుగుతుండడంతో జీడిమెట్ల ఎన్‌సీఎల్ వద్ద వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిని గుర్తించిన అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు రోడ్డు మధ్యలో యూటర్న్ తీసుకునేందుకు వీలుగా బారికేడ్లను ఏర్పాటు చేశారు. అంగడిపేట్, ఎన్సీఎల్, గంగా ఎంక్లేవ్, వైష్ణవి కాలనీ, అపర్ణ షెరినిటీకి వెళ్లే వాహనాలకు ఇబ్బంది లేకుండా చేశారు. సుచిత్ర నుంచి కొంపల్లికి వెళ్లే వాహనాలు సర్వీస్ రోడ్డు మీదుగా వెళ్లేలా ఏర్పాట్లు చేసినట్లు మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్ రెడ్డి తెలిపారు.



ఎన్‌సీఎల్ వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

నారాయణ పాఠశాలలో సంక్రాంతి సంబురాలు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

నిజాంపేట్ : కేపీహెచ్‌బీ జోన్ పరిధి ప్రగతినగర్‌లోని నారాయణ ఒలంపియాడ్ పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్కృతి, సంప్రదాయాలను గుర్తు చేస్తూ, గ్రామీణ వాతావరణం ప్రతిబింబించేలా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథులుగా జోన్ ఏజీఎం ఏ. వైజయంతి హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన విద్యనందించడమే కాకుండా వారి మానసికోల్లాసానికి ఆటపాటలతో కూడిన పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వై.శ్రీలక్ష్మి, జోనల్ అకాడమిక్ కోఆర్డినేటర్స్, జోన్ ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయలు, ఆర్ఐలు, ఏఓలు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలి

కుత్బుల్లాపూర్: వాహనదారులు రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి రఘునందన్‌గౌడ్ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని మేడ్చల్ ఆర్‌టీఓ సిబ్బంది జాతీయ రహదారి 44, ఓఆర్ఆర్‌పై గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. భారీ, చిన్నతరహా ట్రాన్స్‌పోర్టు వాహనాలను ఆపి రిఫ్లెక్ట్ టేపు ఆవశ్యకతను తెలియజేశారు. కార్యక్రమంలో అధికారులు సాదుల శ్రీనివాస్, శిల్ప, సహాయ వాహన తనిఖీ అధికారి త్రివేణిబాయి, కానిస్టేబుళ్లు, హోంగార్డులు పాల్గొన్నారు.



వాహనాన్ని తనిఖీ చేస్తున్న డీటీఓ రఘునందన్‌గౌడ్

తొలగించారు సరే.. తరలింపేది..?

చింతల్: ఐడీపీఎల్ నుంచి గాజులరామారం చౌరస్తాకు వెళ్లే దారిలోని నర్సరీ ఎదురుగా విద్యుత్ వైర్లకు అడ్డుగా చెట్ల కొమ్మలను ఆ శాఖ అధికారులు తొలగించారు. సుమారు 15 రోజులు గడిచినప్పటికీ ఇంకా వాటిని అక్కడి నుంచి తరలించలేదు. మరోవైపు బీటీరోడ్డు పైకి మట్టి రోడ్డు కిందకి ఉండడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



ఐడీపీఎల్-షాపూర్‌నగర్ రోడ్డు నర్సరీ సమీపంలో చెట్ల కొమ్మలు, మరోవైపు దిగుడుగా ఉన్న రోడ్డు

12న ముగ్గుల పోటీలు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట మగ్దూంనగర్ లో మహిళా సమాఖ్య మహిళల ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు మాజీ కౌన్సిలర్ గూడవరమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గుంజ శీను కుత్బుల్లాపూర్ నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హనుమంత రెడ్డి ఐఎన్‌టీయూసీ నాయకుడు చింతల నాగరాజు, జాతీయ కార్యదర్శి బుదాల అమర్ బాబు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐలయ్య గౌడ్, ఎం జనార్ధన్, జగద్గిరిగుట్ట డివిజన్ అధ్యక్షుడు గణేశ్ హాజరుకానున్నట్లు తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ అలాగే పాల్గొన్న ప్రతిఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని సమాఖ్య మహిళలు, నిర్వాహకులు జై, మంగ, తిరుపతమ్మ, సులోచన సత్యలక్ష్మి పేర్కొన్నారు.

ముగిసిన 'సమన్వయ్'

కుత్బుల్లాపూర్: శివ శివానీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో రెండురోజులుగా జరిగిన సమన్వయ్ కార్యక్రమం గురువారం ముగిసింది. పలు ప్రాంతాల నుంచి సుమారు 2000 మంది విద్యార్థులు హాజరయ్యారు. విజేతలకు శ్రేష్ఠ ది యంగ్ మేనేజర్ ఈవెంట్ విజేతకు రూ. 50 వేల నగదు బహుమతి ప్రదానం చేశామని విద్యా సంస్థ ప్రెసిడెంట్ ఆర్తి సంపతి తెలిపారు.

వివాహిత అదృశ్యం



చిత్రశ్రీ

సుభాష్‌నగర్: వివాహిత అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆనంద్‌నగర్ కాలనీకి చెందిన రెడ్డిబాబు, చిత్రశ్రీ (20) భార్యాభర్తలు. గత నెల 20న చిత్రశ్రీ ఇంట్లోవారికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. దీంతో భర్త చుట్టుపక్కల, స్నేహితులు, బంధువులు ఇళ్లలో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో గురువారం సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

మూసాపేట: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు కూకట్‌పల్లి ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం కవిత అన్నారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. సుమారు 80 ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉన్నాయని ఈ నెల 10 ఈ బస్సులకు రిజర్వేషన్లు అయ్యాయని తెలిపారు. బీహెచ్‌ఈఎల్, మియాపూర్, కేపీహెచ్‌బీ, ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట్‌లో పాయింట్లు ఉంటాయని, ఖమ్మం, విజయవాడ, సత్తుపల్లి, వరంగల్, రాజమండ్రి వంటి ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడుస్తాయని పేర్కొన్నారు. ఈ బస్సుల్లో మహాలక్ష్మి పథకం వర్తించదని చెప్పారు. బుకింగ్ లేని బస్సుల్లో మహాలక్ష్మి టిక్కెట్లు తెలంగాణ రాష్ట్ర సరిహద్దు వరకే వర్తిస్తాయని పేర్కొన్నారు.

ఎన్టీఆర్‌నగర్‌లో ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్

నిజాంపేట్: ఎస్‌బీఐ లైఫ్ అండ్ 191 ఎన్‌టీఆర్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ నగర్ శివాలయం గ్రౌండ్‌లో గురువారం సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, బాచుపల్లి సీఐ ఉపేందర్‌రావు, స్థానిక కార్పొరేటర్ ప్రణయ ధనరాజ్ యాదవ్, సీనియర్ నాయకులు అవుల జగన్ యాదవ్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు కడ్తాల్ పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ గుప్తా హాజరయ్యారు. విజేత మహిళలను అభినందించి బహుమతులు అందజేశారు. అనంతరం ఎస్‌బీఐ నూతన సంవత్సర కేలండర్, డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కుమార్‌రెడ్డి, స్పాన్సర్స్ కాళ్లకూరి కాశీ విశ్వనాథ్, కదిరే మధు, దుగ్గి ప్రదీప్, 191 ఎన్‌టీఆర్‌నగర్ ప్రెసిడెంట్ కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ శోభారాణి, కాలనీవాసులు రాజేశ్, ఉపేందర్, మల్లేశ్, నర్సింహానాయక్, శేఖర్ మోహన్, శేఖర్, జితేందర్, దత్తు, మహేందర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కుత్బుల్లాపూర్: తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేట్‌బషీరాబాద్ ఏఈ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ మీనాక్షి ఎస్టేట్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మీనాక్షి కాలనీ, స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీ, అంగడీపేట్ గ్రామం, 11 కేవీ జీడిమెట్ల ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జీడిమెట్ల గ్రామం మెయిన్ రోడ్డు, పిస్తా హౌజ్, మెడ్ వన్ ఆస్పత్రి పరిసరాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

11కేవీ ఇందిరమ్మ కాలనీ ఫీడర్ పరిధిలో..

సుభాష్‌నగర్: ఫీడర్ లైన్ల నిర్వహణ నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో శుక్రవారం అంతరాయం ఉంటుందని డీపీ పల్లి ఏఈ సురేందర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఇందిరమ్మ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బహదూర్‌పల్లి గ్రామం, ఇందిరమ్మకాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

11కేవీ కైలాస్ హిల్స్ ఫీడర్ పరిధిలో..

సుభాష్‌నగర్: 11కేవీ కైలాస్ హిల్స్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గాజులరామారం ఏఈ చైతన్యభార్గవ్ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మహాదేవపురం, బాలయ్యబస్తీ, షిర్డీ హిల్స్, కైలాస్ హిల్స్, ఐశ్వర్య ఎస్టేట్స్, ప్రాగా టూల్స్, నందిని హిల్స్, మహదేవపురం వార్డు కార్యాలయ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని వినియోగదారుల గమనించాలని ఆయన పేర్కొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా

నిజాంపేట్: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ.. దేశంలో ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాల నిర్వహణలో గవర్నర్ల జోక్యంతో ఇబ్బందికరంగా మారిందని, రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం ఏకధాటిగా అధికారాల కేంద్రీకరణకు తీసుకువచ్చిన ఈ ముసాయిదా ఫెడరలిజాన్ని దెబ్బ తీస్తుందన్నారు. ఈ యూజీసీ నిబంధనల ముసాయిదాను వెంటనే వెనక్కి తీసుకోవాలని లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కమిటీ సభ్యురాలు పవిత్ర, తెలుగు యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ నాయకులు రాము, రఘు, శ్రీను, నవీన్, శ్రీలత, శ్రీకాంత్, జ్యోతి, కృష్ణ, రాఘవ, రాజు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

జగద్గిరిగుట్ట: శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ టెంపుల్ ప్రాంగణంలో గురువారం కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హనుమంత్ రెడ్డి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసింది. చైర్మన్‌గా నరేందర్ రెడ్డి, కమిటీ మెంబర్లుగా రాజు, రవీందర్, బుచ్చిరెడ్డి, వేణు గౌడ్, శ్రీనివాస్ చారి, సునిత ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.



ప్రమాణ స్వీకారంలో హనుమంత్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు

తుది దశకు ఏసీపీ కార్యాలయ భవనం పనులు

కుత్బుల్లాపూర్: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పేట్‌బషీరాబాద్ ఏసీపీ నూతన కార్యాలయ భవనం పనులు తుది దశకు చేరుకున్నాయి. సంక్రాంతి తర్వాత ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటివరకు పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ బిల్డింగ్‌లోనే ఏసీపీ కార్యాలయం కొనసాగుతున్నది. అయితే సిబ్బందికి సరిపడా స్థలం లేకపోవడంతో నూతన కార్యాలయం నిర్మిస్తున్నారు. అదేవిధంగా మేడ్చల్ డీసీపీ కార్యాలయం పనులు కూడా ప్రారంభం అయ్యాయి. సుమారు 4 ఎకరాల విస్తీర్ణంలో ఇప్పటికే పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌తో పాటు అల్వాల్ ట్రాఫిక్, మేడ్చల్ అదనపు డీసీపీ, ఎస్ఓటీ, క్రైమ్‌కు సంబంధించిన స్టేషన్లు ఉన్నాయి.



పేట్‌బషీరాబాద్ ఏసీపీ కార్యాలయం

ఇంజినీరింగ్ విద్యపై అంతర్జాతీయ సదస్సు ప్రారంభం



సదస్సు ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న వక్తలు

నిజాంపేట్: ప్రగతినగర్ వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఇంజినీరింగ్ విద్యలో అవసరమైన సమూలమైన మార్పులు కేంద్రంగా 3 రోజుల పాటు జరగనున్న అంతర్జాయ సదస్సు ఐసీటీఐఈఈ 2025 గురువారం ప్రారంభమైంది. వీఎన్ఆర్ వీజేఐఈటీతో సహా విజ్ఞానజ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆతిథ్య సంస్థలుగా ఇండో యూనివర్సల్ కొలాబోరేషన్ ఫర్ ఇంజినీరింగ్ ఎడ్యుకేషన్ (ఐయూసీఈఈ) సంస్థ సహకారంతో నిర్వహించిన ఈ సదస్సు 12వ సంపుటిలో గౌరవ అతిథి, ఏబీఈటీ (యూఎస్ఏ) సీఈఓ డా.మైఖేల్ మిలిగన్, ఐయూసీఈఈ వ్యవస్థాపకులు, కార్యనిర్వాహక సంచాలకులు ఆచార్య డా.కృష్ణ వేదులతో సహా యూఎస్ఏ, ఆస్ట్రేలియా, ఆస్ట్రియా, ఫిన్‌లాండ్, పోర్చుగల్ తదితర దేశాలతో పాటు మనదేశంలోని పలు రాష్ట్రాల నుంచి విద్యావేత్తలు, పరిశ్రామిక నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. కృతిమ మేథ వల్ల కలిగే ప్రయోజనాలు, అనుకూల ప్రతికూల ప్రభావాలు, నేటి తరం విద్యార్థులకు అనుగుణమైన విద్యాబోధనాసరళి, సమస్య పరిష్కర్తలుగా బాధ్యతాయుతంగా ఎదగటానికి తగిన స్థైర్యంతో యువ విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన అవసరం వంటి పలు అంశాలను ప్రస్తావించారు. సదస్సులో భాగంగా ఐయూసీఈఈ వార్షిక విద్యార్థి సమితి ఐఏఎస్ఎఫ్ 2025 పేరిట పలు రాష్ట్రాల విద్యార్థుల డిజైన్ థింకింగ్, ఇంజినీరింగ్ ప్రాజెక్టుల ప్రదర్శనతో సహా విద్యార్థులు, అధ్యాపకులకు ప్రత్యేక కార్యశాలలు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా సదస్సు ప్రత్యేక సంచికను అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీఎన్ఆర్ విజేఐఈటీకి చెందిన విద్యార్థి ప్రగతి డీన్ ఆచార్య డా.వై. పద్మశాయి, సంచాలకులు ఆచార్య డా.బి.చెన్నకేశవరావు, ప్రధానాధ్యాపకులు ఆచార్య డా.సి.డి. నాయుడు, వీజేఐఎం సంచాలకులు ఆచార్య డా.భరత్‌భూషణ్‌సింగ్, విజ్ఞానజ్యోతి సంస్థల పురోగమన సంచాలకులు ఆచార్య డా.కోడె సంధ్య, పూర్వ అధ్యక్షుడు డా.డి.ఎన్.రావు తదితరులు పాల్గొన్నారు.